

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

» సమీక్షా సమావేశంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారి ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. రహదారి మూల మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణాలో, ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరిగే చోట వేగ నియంత్రణలను ఏర్పాటు చేయాలన్నారు. మంచిర్యాల నుంచి వచ్చే దారిలో ఆసిఫాబాద్ పట్టణ ముఖద్వారం వద్ద సుందరీకరణ పనులు చేపట్టలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన తరగతులు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ఇతర భారీ వాహనాలు నడిపే తప్పని సరిగా సీటు బెల్టు ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖాధికారి రాంచందర్, రోడ్డు భవనాల శాఖ అధికారి సురేందర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు

కాగజ్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో తెలుగదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చల్లూరి శంకర్, జె.దేవేందర్, .మధుకర్, యలమంచలి శ్రీనివాస్, సంజీవ్, గులాబ్ రావు, సత్యనారాయణ, రాజేష్, మక్బూల్, సురేందర్ పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

కాగజ్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబును శనివారం కొలాం మన్నె వార్ సంఘ నాయకులు కాగజ్ నగర్‌లో కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కొలాం మన్నెవార్ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించినందులకు ఎమెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుర్స పోచయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల రామస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్మారాజు, రాష్ట్ర యువజన అధ్యక్షులు గోపాల్, జిల్లా అధ్యక్షులు డబ్బాబాపు, రూపేష్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ అలీబీన్ అహ్మద్, తహసీల్దార్ రోహిత్, డీటీ పోచయ్య, నాయకులు రవీందర్, భీమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

ఆసిఫాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో ఆదేశాల మేరకు జిల్లాలోని సెర్ప్‌లో పని చేస్తున్న సిబ్బంది ధ్రువపత్రాలను పరిశీలించామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెర్ప్‌లో పని చేస్తున్న సిబ్బంది ధ్రువపత్రాలను శనివారం పరిశీలించారు. కార్యక్ర మంలో ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి యాదగిరి, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, డీపీఎం అన్నాజీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఆసిఫాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బాబేఝరి, జోడేఘాట్, పాటగూడ గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గ్రామాల్లో తీవ్రమైన మంచినీటి సమస్య ఉందని చెప్పారు. తిర్యాణి మండలం గుండాల, మంగి, మాణిక్యాపూర్, గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వాంకిడి మండలంలో రింగారిట్ గ్రామంలో 30 కుటుంబాలు ఒకే బోరుపై ఆదార పడి జీవిస్తున్నారన్నారు. మిషన్ భగీరథ పైపు లైన్లు ఉన్నప్పటికీ నీళ్లు రావడం లేదని చెప్పారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో నాయకులు రాజన్న, శీరనివాస్, దినకర్, ఆనంద్ కుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పీరీల బంగ్లాను దహనం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం కోసార గ్రామ పంచాయతీ పరిధిలోని భవానీనగర్ గ్రామంలోని గుట్టపై ఉన్న పీరీల బంగ్లా వద్ద క్షుద్రపూజలు చేసి పీరీల బంగ్లాను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. పీరీల బంగ్లా వద్ద శుక్రవారం రాత్రి క్షుద్రపూజలు చేసిన దుండగులు డీజిల్ పోసి పీరీల బంగ్లాను తగలబెట్టారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ దపంతులను ఘనంగా సన్మానించారు. అనంతరం విశ్వవసు నూతన సంవత్సర పంచాంగం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, కమిటీ సభ్యులు శిరీష్ శర్మ, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

కాగజ్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా వాహనాల్లో తరలిస్తున్న పశువులను శనివారం భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు కాగజ్‌నగర్ ప్రధాన రోడ్డుపై పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

రెబ్బెన, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలానికి చెందిన మహ్మద్ జమీల్, తబస్సుం సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెకలను శనివారం కాంగ్రెస్ సీనియర్ పార్టీ నాయకులు మోడం సుదర్శన్‌గౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఇమ్రాజ్ అలీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ దండే విఠల్ కృషితో చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు జహీర్ బాబా, మైనార్టీ నాయకులు నాసిర్ ఉస్మని, ఆరీఫ్ బాయ్, అర్షద్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు, నాయకులు

సిర్పూర్(టి), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ షకీల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కీజర్ హుస్సేన్, అబ్దుల్ అకీల్, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన తరగతులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థులకు ఏప్రిల్ 3 నుంచి అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 9.30 వరకు ఈ తరగతులు నిర్వహించనున్నామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వార సంతకు వేలం

బెజ్జూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే వార సంతకు శనివారం ప్రత్యేకాధికారి అబ్దుల్ నదీం ఆధ్వర్యంలో కార్యదర్శి తుకారాం వే లం పాట నిర్వహించారు. ఈ వేలంలోవెంకటేష్, సిరాజ్, మేరాజ్‌హుస్సేన్ పాల్గొన్నారు. రూ.3,30,000కు సాలమ వెంకటేశం దక్కించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్, కారోబార్ వసంత్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా

ఇర్ఫాన్ అహ్మద్, మిషన్‌భగీరథ డీఈఈ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మారుమూల గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

డీఈఈ: ప్రతీ గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా అయ్యేల చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా పైప్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఎండాకాలంలో నీటి ఎద్దడి గల గ్రామాలకు ప్రత్యామ్నాయంగా ఏమైనా ఏర్పాట్లు చేస్తున్నారా ?

డీఈఈ: ఎండాకాలంలో బోర్ బావుల్లో నీరు ఇంకి పోయి నీటి ఎద్దడి తలెత్తే గ్రామాలకు పంచాయతీల ద్వారా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నాం. ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికతో వెళ్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు కలిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలి?

డీఈఈ: జిల్లాలో ఎక్కడైనా నీటి సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1800-599-4007కు ఫోన్ చేయాలి. తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

వాంకిడి, ఆంధ్రజ్యోతి

మిగిలింది రెండు రోజులే

● ఆస్తి పన్ను వసూళ్లకు ఇంటింటికీ వెళుతున్న అధికారులు ● వందశాతం పూర్తి చేసేందుకు చర్యలు



ఆస్తి పన్ను తీసుకుంటున్న అధికారులు

కెరమెరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నుల వసూళ్ల లక్ష్యం చేరడానికి మరో రెండు రోజులే మిగిలి ఉన్నాయి. మార్చి నెలాఖరులోగా వందశాతం పూర్తి చేసేందుకు సిబ్బంది గ్రామాల్లో ఇళ్లకు వెళుతూ అవగాహన కల్పిస్తూ వసూల్లు చేస్తున్నారు. పల్లెలు అభివృద్ధి చెందాలంటే గ్రామస్థులు పన్నులు చెల్లించాలని చెబుతున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న 14, 15 ఎస్ఎఫ్‌సీ నిధులతో పాటు గ్రామాల్లో ఇంటి వాణిజ్య సముదా యాలు చెల్లించే పన్నులు కీలకంగా మారుతాయి. ప్రజలకు వసతులు కల్పించాలంటే ఇందుకు అవసరమైన నిదులను గ్రామాల్లో ఏటా ఇంటి పన్నులు వసూలు చేయడం తప్పని సరిగా భావిస్తున్నారు. ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని పంచాయతీ సిబ్బంది నిర్ణయించారు. ఇప్పటికే కెరమెరి మండలంలో ఆయా గ్రామాల్లో అధికారులు పంచాయతీ కార్యదర్శులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని సిబ్బంది ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నారు. కెరమెరి మిగితా జీపీల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలైంది.

31 పంచాయతీలు..

మండలంలోని 31 పంచాయతీలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం వంద శాతం పన్నులు వసూలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ ముగియనుండడంతో గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలుపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇప్పటికే మండలంలో ఒవరాల్‌గా 98 శాతం వసూలు చేశారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు అయిన గ్రామ పంచాయతీల్లో గోండుగూడ, నిషాని, కేలి(ఇ), మెట్టపిప్పిరి, రిగన్‌ఘాట్, సాకడ, ఆగర్‌వాడ, బాబేఝరి, బోరిలాల్‌గూడ, దేవాపూర్, ముక్దంగూడ, పరందోళి, మోడి, పార్ద, కేస్లాగూడ, సాంగ్వీ, ఖైరి, కోటారి, అనార్‌పల్లి, సుర్దాపూర్, గోయగాం, తుమ్మగూడ, దనోర, జోడేఘాట్, కరంజివాడ, అంతాపూర్, సావర్‌ఖేడ, బోలాపటార్, ఇందాపూర్, ఝరి గ్రామ పంచాయతీలున్నాయి.

శుక్రవారం నాటికి రూ.9,50,670 పన్ను వసూలుకుగాను రూ.9,70,863 వసూలు చేశారు. వందశాతం వసూళ్లే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో అంజద్‌పాషా ప్రత్యేక దృష్టి సారించి కెర మెరి జీపీలో ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి గణేష్‌తో పాటు తరుణ్ (సుర్దాపూర్), శ్వేత(ఖైరి), వాజీద్(సావర్‌ఖేడ), హరీష్ (కేస్లా గూడ) పంచాయతీ కార్యదర్శులను పన్నుల వసూలుకు తాత్కాలికంగా నియమించారు. రెండు రోజులుగా మండల కేంద్రంలో క్షేత్ర స్థాయిలో ఇంటి పన్ను వసూలు కోసం కృషి చేస్తున్నారు. ఈ నెల 31వరకు వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారు.

ప్రజలు సహకరించాలి..

అంజద్‌పాషా, కెరమెరి ఎంపీడీవో



గ్రామాల్లో పేరుకు పోయిన ఇంటి పన్ను వసూలుకు ప్రజలు సహకరించాలి. ఇప్పటికే 29 గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్ను వసూలైంది. ఈ నెల 31 వరకు స్పెషల్ డ్రైవ్‌తో మిగితా రెండు గ్రామ పంచాయతీలో మిగిలిన బకాయిలను పూర్తి చేస్తాం. ప్రజలు చెల్లించే డబ్బులతోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం.

ఇంటి పన్ను చెల్లిస్తేనే అభివృద్ధి..

గణేశ్, పంచాయతీ కార్యదర్శి



గ్రామాల్లో ఇంటి పన్ను వసూలుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. రోజు వారీగా వసూలు చేసిన పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. వంద శాతం వసూలు లక్ష్యంగా గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నాం. పన్ను సక్రమంగా వసూలైనప్పుడే గ్రామాల అభివృద్ధి దోహదపడుతుంది.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బెల్లంపల్లి రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలంలోని బూదుకుర్దు గ్రామానికి చెందిన పెద్దపల్లి మల్లయ్య అనే వ్యక్తి ఇల్లు శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. మల్లయ్య కుటుంబ సభ్యులు గ్రామంలోని ఆలయానికి వెళ్లగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న రూ.లక్ష నగదు, ఆరుక్వింటాళ్ల బియ్యంతో పాటు, టేకు ఫర్నీచర్, నిత్యావసరసరుకులు దగ్ధమయ్యాయని బాధితుడు పేర్కొన్నారు. సుమారు ఆరు లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. సంఘటన స్థలాన్ని ఎంపీడీవో మహేందర్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

50 లీటర్ల నాటుసారా పట్టివేత

వేమనపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలోని సూరారం గ్రామంలో నాటుసారా ప్యాకెట్లతో వచ్చిన వ్యక్తిని గ్రామ యువకులు శనివారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నెన్నెల మండలం లంబాడితండాకు చెందిన దరావత్ రవీందర్ 50 లీటర్ల నాటుసారాతో శనివారం సూరారం గ్రామానికి వచ్చాడు. ఇది గమనించిన అక్కడి యువకులు అతన్ని పట్టుకున్నారు. గ్రామంలో నాటు సారా అమ్మకాలు జరపవద్దని చెప్పినప్పటికీ ఎందుకు వచ్చావని అతన్ని ప్రశ్నించి అతని ద్విచక్రవాహనాన్ని, నాటుసారాను యువకులు పట్టుకుని నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్ పటేల్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సూరారం గ్రామానికి వచ్చి నాటుసారా విక్రయిస్తున్న రవీందర్‌ను, 50 లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్రవాహనాన్ని పట్టుకుని నిందితునిపై కేసు నమోదు చేశారు.

బెల్లంపల్లిలో రెండు ఇళ్లలో చోరీ



దొంగలు పగులకొట్టిన బీరువా

బెల్లంపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాలో శుక్రవారం రాత్రి దుండగులు రెండు ఇళ్లలో చొరబడి పెద్ద ఎత్తున బంగారంతో పాటు నాలుగు బైక్‌లను ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సాన శ్రావణ్ శుక్రవారం రాత్రి తన ఇంటిలో కుటుంబసభ్యులతో నిద్రిస్తున్న సమయంలో దొంగలు ఇంట్లోని బీరువాను పగులకొట్టి అందులో నుంచి 14తులాల బంగారంతో పాటు కిలోన్నర వెండిని ఎత్తుకెళ్లారన్నారు. కాల్‌టెక్స్ ఏరియాలోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధాకర్ ఇంటిలో దొంగలు చొరబడి 70వేల నగదుతో పాటు అయిదు తులాల బంగారాన్ని అపహరించారు. కాల్‌టెక్స్ ప్రాంతంలో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన నాలుగు ద్విచక్రవాహనాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

కాసిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి : కోమటిచేను సమీపంలో ఈ నెల 3న బైక్‌పై నుంచి కిందపడిన ఓరియంట్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్టు కార్మికుడు నిశ్చకోళ్ల శ్రీనివాస్(48) హైద్రాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో శ్రీనివాస్ కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 3న సోమ గూడెంకు వెళ్లి బైక్‌పై దేవాపూర్‌లోని ఇంటికి తిరిగి వస్తుండగా కోమటిచేను సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు కాసిపేట పోలీసులకు సమాచారం అందించగా అంబులెన్స్‌లో తరలించగా అక్కడ నుంచి మెరుగైన వద్యం కోసం హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

మంచిర్యాల క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఏసీసీ అంబేద్కర్ విగ్రహం సమీపంలో శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రధాన రహదారిపై తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మహిళకు సుమారు 55 సంవత్సరాలు ఉంటాయి. మృతదేహాన్ని ప్రభుత్వ మార్చురి గదిలో భద్రపరిచారు. పూర్తి వివరాల కోసం 87126 56534 సంప్రదించాలని కోరారు.

దివ్యాంగులకు చేయూతనివ్వాలి



దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సమాజం చేయూతనివ్వాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలీంకో, బీడీఎల్ సంస్థల ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రైకిళ్ళ, వాహనాల, కృతిమ కాళ్ల, కృత్రిమ చేతులు, వినికిడి పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు ఒకరిపై ఆధారపడి కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. వీరిని చిన్నచూపు చూడకుండా బాసటగా నిలిచేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులకు సహాయం అందిస్తున్న అలీంకో సంస్థ, బీడీఎల్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయురాలు

● విచారణ చేపట్టిన ఎంఈవో

భీమిని, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు నలుగురు విద్యార్థులను అకారణంగా ఇష్టారీతిన కొట్టిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు సుజాత ఆరు, ఎనిమిది తరగతులు చదువుతున్న సుప్రజ, తేజస్విని, భవాని అనే విద్యార్థులు ఫోన్ ద్వారా తమ తల్లిదండ్రులకు తెలుపడంతో విషయం బయటకు పొక్కింది. భవాని అనే విద్యార్థి కింద పడి తెలివి తప్పినట్లుగా తోటి విద్యార్థులు తెలిపారు. తన వద్ద కాస్మోటిక్ వస్తువులు కొనడం లేదనే కోపంతో సుజాత టీచర్ కొట్టినట్లు విద్యార్థులు చెపుతున్నారు. ఇదే విషయమై ఎంఈవో కృష్ణమూర్తికి తెలియడంతో ఆయన శనివారం పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రెటరీ కె యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని జ్యోతిబాఫూలే పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పరిసరాలను శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం జిల్లా సబ్ జైలును సందర్శించి ఖైదీల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని వాళ్ల ప్రభుత్వ న్యాయవాదులను నియమించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నరహరి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్వర్లు, ఆంజనీదేవి, ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా కళాకారులకు అవకాశం కల్పించాలి



కలెక్టర్ వెంకటేష్ దోత్రేను సన్మానిస్తున్న రచయిత, దర్శకుడు నాగబాల సురేష్

ఆసిఫాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కళాకారులకు టీవీ, సినీ రంగాల్లో అవకాశం కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం కళాకారులు, టీవీ, సినీ రచయితలు, దర్శకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని టీవీ సీనియర్ దర్శకుడు నాగబాల సురేష్‌బాబుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కళాకారులకు, క్రీడాకారులకు కొదువ లేదని చెప్పారు. కళాకారులు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. జిల్లాలో టీవీ సీరియల్, సినిమా షూటింగ్‌లకు అనువైన ప్రదేశాలు జిల్లాలో చాలా ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ప్రాచీన దేవాలయాలు, జలపాతాలు, సింగరేణి గనులు, సిర్పూర్ కాగిత పరిశ్రమ, ప్రాణహిత, పెద్దవాగు పరివాహక ప్రాంతాలు కుమరం భీం ప్రాజెక్టు వంటి సుందరమైన ప్రదేశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత్ కల్చర్ అకాడమి, ఓం సాయి తేజ ఆర్ట్స్ సంయుక్త నిర్వహణలో ఈ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకుని క్రమ శిక్షణ, పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీవీ సీరియర్ దర్శకులు ప్రేంరాజ్, స్థానికులు డి.రామారావు, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ, రాధాకృష్ణచారి, బిట్టు వెంకటేశ్వర్లు, సునీల్, సంతోష్ పాల్గొన్నారు.

పారదర్శకంగా సహాయ ప్రొఫెసర్ల ఎంపిక


ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు బోధన అందించేందుకు ఇంటర్వ్యూ ద్వారా సహాయ ప్రొఫెసర్లను పారదర్శకంగా ఎంపిక చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలో సమీపంలోని అంకుశా పూర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సహాయ ప్రొఫెసర్ల ఎంపిక కోసం శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూకు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మితో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు సహాయ ప్రొఫెసర్లను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశామని తెలిపారు. అనంతరం కళాశాలలోని వివిద బ్లాక్‌లను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసి వైద్య విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

బైక్ పై నుంచి పడి యువకుడి దుర్మరణం

తాండూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని త్రిఇంక్లైన్ గ్రామం వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో కంపెల్లి సాగర్ (28) అనే యువకుడు మృతి చెందినట్లు మాదారం ఎస్ఐ సౌజన్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం తిర్యాణి గ్రామానికి చెందిన సాగర్ శనివారం పని నిమిత్తం బైక్‌పై తాండూర్‌కు వచ్చాడు. తిరిగి రాత్రి 8 గంటలకు తిర్యాణికి వెళ్తుండగా త్రిఇంక్లైన్ గ్రామం వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చే సుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

ఆసిఫాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలో డీసీఆర్బీ డీఎస్పీగా పని చేస్తున్న కరుణాకర్, ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న రాజేశ్వర్‌లు శనివారం పదవి విరమణ పొందగా వారిని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవి విరమణ వీడ్కోలు కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగి జీవితంలో పదవి విరమణ అనివార్యమన్నారు. వీరు పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. పోలీసుశాఖ నుంచి రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామన్నారు. అనంతరం ఇతర పోలీసు అధికారులు వీరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాం చ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, సీఐ రవిందర్, పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ్‌శంకర్‌రెడ్డి, ఆర్ఐ అంజన్న, డీసీఆర్బీ సీఐ శ్రీధర్, డీపీఓఏవో శ్రీనివాస్‌రెడ్డి, సీసీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్కే-5, ఆర్కే-6, సీహెచ్‌పీలలో పనిచేస్తూ విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులు డీజీఎం (పర్సనల్) అరవిందరావు ఆధ్వర్యంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటి వరకు చాలా మంది ఏడాదికి 100 మస్టర్లు కూడా పూర్తి చేయలేదని, కానీ ఇక నుంచి ప్రతి నెలా 20 మస్టర్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డిప్యూటీ సీఎంఓ రమేష్‌బాబు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డీవైపీఎం రాజేష్, సీనియర్ పీవోలు రణదీప్‌గౌడ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజే 3.25 లక్షల టన్నుల బొగ్గు రవాణా



మాట్లాడుతున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్ మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఒక్కరోజులోనే 3 లక్షల 25వేల 243 టన్నుల బొగ్గును రవాణా చేసిన ఉద్యోగులకు అభినందనలు అని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం ఆయన అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడారు. శుక్రవారం ఈ రికార్డు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇదే ఒరవడితో వచ్చే ఆర్థిక సంవత్సరంలో 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధనకు గట్టి పునాది వేయాలని సూచించారు. దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద 7.24 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణ, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఈడీ(కోల్‌మూమెంట్) సుభాని, జీఎంలు మనోహర్ (సీపీపీ), రాజశేఖరరావు (మార్కెటింగ్) పాల్గొన్నారు.

హెల్త్‌కార్డుల కోసం దరఖాస్తు గడువు పెంపు

శ్రీరాంపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్, అన్‌ఫిట్, మరణించిన, ఉద్యోగుల కు టుంబ సభ్యులు హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు పెంచినట్లు డీజీఎం(పర్సనల్) పి అరవిందరావుయ శనివారం ఒక ప్రక టనలో తెలిపారు. అర్హత కలిగి ఉండి, ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు 60 వేల రూపాయల ఉద్యోగి వాటా కింద చెల్లించి కార్డులు పొందాలని సూచించారు.

ఎస్‌టీపీపీలో రిజర్వేషన్లు తప్పనిసరిగా కల్పించాలి



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను సన్మానిస్తున్న ఎస్‌టీపీపీ అధికారులు

జైపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లోని ఎస్‌టీపీపీలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు తప్పనిసరిగా కల్పించాలని, నిర్లక్ష్యం చేస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఎస్‌టీపీపీలోని అడ్మిన్ బిల్డింగ్‌లో సింగరేణి పవర్ ప్లాంట్ అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టీపీపీ ఈడీ కె. శ్రీనివాసులు, శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్‌లు కమిషన్ చైర్మన్, సభ్యులకు స్వాగతం పలికారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యుత్ ప్లాంటుకు సంబంధించిన పూర్తి వివరాలను కమిషన్ సభ్యులకు ఎస్‌టీపీపీ ఎస్ఓ టు ఈడీ ప్రభాకర్ రావు వివరించారు. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ భూ నిర్వాసితులకు ఎస్‌టీపీపీలో ఎంత మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని పవర్‌మేక్ కంపెనీ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌టీపీపీలో రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఎంత శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలో 59 జీవో ప్రకారం అమలు చేయాలని హెచ్చరించారు. కొంతమంది అధికారులు ఎస్‌టీపీపీ ప్రాంగణం ఎదుట అంబేద్కర్ విగ్రహం, లైబ్రరీ, స్కిల్ సెంటర్ ఏర్పాటుకు చొరవ చూపాలని కమిషన్ చైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, ఎస్‌టీపీపీ అధికారులు ఓ అండ్ ఎం జెఎస్‌సింగ్, పంతులానాయక్, సంజీవ్, చంద్రమణి, మదన్ మోహన్ పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే న్యూటెక్ గనిని శనివారం ఆయన జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. గని ఆవరణలో ఉన్న క్యాంటీన్‌లో కార్మికులతో కలిసి అల్పాహారం చేశారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజెంట్ రాజేందర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఎస్సీ లైజన్ అధికారి కిరణ్ కుమార్, మేనేజర్ స్వామిరాజు, తదితరులుపాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతులు

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం(140/2019) ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్ రావు, పంతులా నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు శనివారం పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్ కుమార్, బ్రాంచ్ కార్యదర్శులు వెంకటేష్, సుమన్, లక్ష్మీ, సలహాదారు నర్సింగరావు, సంయుక్త కార్యదర్శి శంకర్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్, కమ్యూనికేషన్ ఇన్‌చార్జి నరేష్, ఐకే-1ఏ పిట్ కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

'కార్మికులపై వేధింపులు సరికాదు'

శ్రీరాంపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కార్మికులపై వేధింపులు సరికాదని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎండి. రియాజ్ అహ్మద్, కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య కోరారు. జీఎం ఎం శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ నెల 13వ తేదీన ఇందారం 1ఏ గనిలో జరిగిన ప్రమాదంలో కార్మికుడు తీవ్రంగా గాయపడితే అధికారులు తప్పుడు రిపోర్టు రాసినందుకు ప్రశ్నించడంతో తమ యూనియన్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లరికల్ సిబ్బందిపై పనిభారం తగ్గించాలి

శ్రీరాంపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో అన్ని విభాగాల్లో పని చేస్తున్న క్లరికల్ సిబ్బందిపై పనిభారం తగ్గించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. గత ఏడాది మార్చిలో జూనియర్ అసిస్టెంట్(క్లరికల్) గ్రేడ్-2 ఇంటర్నల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన యాజమాన్యం ఇంతవరకు ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదని పేర్కొన్నారు. సర్క్యులర్‌లో ఇచ్చిన 360 పోస్టులను పెంచుతూ, యాక్టింగ్ క్లర్కులను రెగ్యులర్ చేయాలని కోరారు.

షడ్రుచుల సమ్మేళనం

'విశ్వావసు' ఆగమనం



నేడు ఉగాది పర్వదినం..

ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు

నస్పూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వసంత ఋతువు ఆగమనం, లేత మామిడి చిగుళ్లు, మధురమైన కోయిలగానం... ఇవన్నీ ఉగాది పర్వదినానికి అలంకారాలు. ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, బంధు మిత్ర సమాగమం లాంటివన్నీ సన్మార్గంలో నడవడానికి ఏర్పరచుకున్న సంప్రదాయాలు. వీటన్నిటి సంగమమైన ఉగాది ఒక ఆహ్లాదకరమైన పర్వదినం. మంచి పనులను మొదలుపెట్టడానికి ఈ రోజు ఎంతో శ్రేష్టమైనది. పండగల్లో అత్యంత విశిష్టమైన పండుగ ఉగాది. ఈ పండుగ నుంచే కొత్త సంవత్సరం ఆరంభమవుతుంది. తెలుగు సంవత్సరం శిశిర రుతువు పాల్గుణ అమావాస్య ముగియడం, మరుసటి రోజు నుంచే శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ప్రారంభం అవుతుంది. జిల్లాలో ఉగాది పర్వదినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకోవడానికి ఆయా ఆలయాల్లో పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



మంచిర్యాల మార్కెట్‌లో సందడి

గుమ్మాల అలంకరణలు...

శిశిరంలో ఆకురాలు కాలం, అనంతరం వచ్చే వసంత కాలంలో చెట్లు చిగుర్చి ప్రకృతి శోభాయ మానంగా కనిపిస్తోంది. తెలుగు వారి మొదటి పండగ ఉగాది నుంచి మొదలు అవుతుంది. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలను కట్టి అలంకరణ చేస్తారు. ఉదయమే తలస్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి దైవారాధన చేసి షడ్రుచుల ఉగాది పచ్చడిని దైవానికి సమర్పించి స్వీకరించాలి. ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

ఆరు రుచుల..ఉగాది పచ్చడి..

ఈ పండుగలకు కాలమే దైవం, మారుతున్న కాలంతో పాటు మనుషుల శరీర మానసిక స్థితిగతుల్లో కూడా మార్పులు చోటు చేసుకుంటాయి. తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదులను కలగలపుగా తయారయ్యే పచ్చడి స్వీకరించే ఆచారం ఉగాది నాడు మాత్రమే ఉంటుంది.

మార్కెట్లో సందడి..

ఉగాది పర్వదినం సందర్భంగా మార్కెట్లో ఉగాది సందడి నెలకొంది. ఉగాది పచ్చడి తయారి కోసం వినియోగించే మామిడి కాయలు, చింతపం డు, బెల్లం, తదితర వాటిని దుకాణాల వద్ద జనాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆయా కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు జనం సందడితో కనిపిస్తున్నాయి.

అందరికీ మంచి జరగాలి - గంగారపు వంశీ కృష్ణ శర్మ- పూజారి, నస్పూర్ కాలనీ



నూతన ఏడాదిలో అందరికి మంచి జరుగాలి. హిందూవులకు పెద్ద పండగల్లో ఉగాది పండగనే. ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్ర మాలతో పాటు శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆరంభం సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

మందమర్రిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడపవద్దని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల మద్యం సేవించి పట్టుబడిన వారికి పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మద్యం సేవించడం నడపడం వల్లనే జరుగుతున్నాయన్నారు. మందమర్రి సర్కిల్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో 700 కేసులు నమోదయ్యాయని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించి నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మందమర్రి, కాసిపేట ఎస్ఐలు రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

రక్తదానంలో యువత ముందుండాలి

బెల్లంపల్లి, మార్చి29 (ఆంధ్రజ్యోతి): రక్తదానంలో యవత ముందుండాలని జూనియర్ సివిల్ జడ్జి ముకేశ్ అన్నారు. శనివారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనహిత సేవా సభ్యులు 8 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. నేటి యువత రక్తదానం పై అపోహలు వీడి రక్తదానికి ముందుకు రావాలని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన పలువురికి ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం జడ్జి రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమలో ఆర్డీవో హరిక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, జనహిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్, మాజీ కౌన్సిలర్ గెల్లి రాజలింగు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు ఉగాది సంబరాలు

దండేపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లారి శ్రీనివాస్, శ్రీలత, బుచ్చన్నలు అన్నారు. దండేపల్లి మండలం గుడిరేవు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుడిరేవు, పెద్దపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విశ్వావసు నామ సంవత్సర ముందస్తు ఉగాది వేడుక సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్యామల, రాజశేఖర్, నరేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని రెడ్డిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాజేశం ఆధ్వర్యంలో విద్యార్థులు ఉగాడి పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ, మాజీ సర్పంచు దాసరి మధునయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాల, దేవులవాడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, కోటపల్లి ఉన్నత పాఠశాలల్లో శనివారం ఉగాది సంబరాలను ముందస్తుగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఉగాది పచ్చడిని తయారుచేశారు. మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అనిత, హెచ్ఎంలు శ్రీనివాస్, కృష్ణ మూర్తి పాల్గొన్నారు.



గుడిరేవు ప్రభుత్వ పాఠశాలోని ఉగాది సంబరాలు...



మోడల్ స్కూల్‌లో ఉగాది పచ్చడి తయారు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రేషన్‌కార్డు లేకున్నా సంక్షేమ పథకాలను అందించాలి

బెల్లంపల్లి, మార్చి29(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను లబ్దిదారులకు అందజేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రాజమౌళి అన్నారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసరి చేయడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ఏర్పడ్డాక ఇప్పటి వరకు రేషన్‌కార్డులు మంజూరు చేయలేదని, దీంతో ఎంతో మంది లబ్దిదారులకు సంక్షేమ పథకాల విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు. రాజీవ్ యువ వికాస్ కోసం దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ కార్యాలయంలో మీసేవాలో ఆన్‌లైన్ ప్రక్రియ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంచిర్యాల క్రైం, మార్చి29(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల పట్టణం అండాలమ్మకాలనీ ఈద్‌గా కాంపోండ్, గేట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈద్‌గా కాంపొండ్, గేటు అభివృద్ధి పనుల కోసం 30లక్షల రూపాయలతో పనులు చేయించడం జరిగిందన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్షెట్టిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి పట్టుదల క్రమశిక్షణతో చదవాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని ఎస్పీఆర్ గార్డెన్స్‌లో శనివారం సాయంత్రం స్థానిక కెరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పట్టుదల ఉంటే మనం ఏమి అనుకున్నా సాధించగలుగుతామన్నారు. ప్రతీ విద్యార్థి ఇప్పటి నుండే ఒక లక్ష్యం ఎంచుకోవాలని దాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి హెలన్‌డార్థి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పింగిళి రమేష్, చల్లా నాగభూషణం, అంకతి శ్రీనివాస్‌తో పాటు పార్టీ శ్రేణులు పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

మంచిర్యాల క్రైం: మంచిర్యాల పట్టణం బాలుర పాఠశాల మైదానంలో పవిత్రరంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయనతో పాటు కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఎమ్మెల్యే ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్షను విరమింప చేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి

సీవీరామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గడిపెల్లి నర్సయ్య

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): యువత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర సమర యోధులను స్మరించుకొని దేశభక్తిని పెంపొందించుకోవాలని ఉమ్మడి జిల్లా యువజన సర్వీసుల శాఖ, యూత్ అధికారి సుశీల్‌బడ్, సీవీరామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గడిపెల్లి నర్సయ్య పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీవీరామన్ డిగ్రీ కళాశాల ఆవరణలో కేంద్ర యువజన సర్వీసులశాఖ, క్రీడాశాఖల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్‌ఫేర్, ఫొటో గ్రఫీ, చిత్రలేఖనం, కవితా సంకలనం, ఉపన్యాసం, కల్చరల్ పోటీల్లో జిల్లాకు చెందిన పలు డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. మొదటి బహుమతిగా 7వేల నగదు, తృతీయ బహుమతికి 5వేలు, తృతీయ 3,500 నగదుగా బహుమతులు అందజేశారు. అనంతరం ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈ వేదిక సరిగ్గా ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అమృత ఉత్సవాలను విద్యార్థుల కోసం కేటాయించి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి యువజన ఉత్సవాలను నిర్వహించేందుకు కృషి చేసిన ప్రధానమంత్రి మోదీ అభినందనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సురేశ్, ఉమ్మడి జిల్లా కళాశాలల సంఘం అధ్యక్షుడు రమణ, శ్రీహర్ష కాలేజీ కరస్పాండెంట్ పల్లె భూమేశ్, మిమ్స్ కాలేజీ డైరెక్టర్ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.



వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

చలివేంద్రం ప్రారంభం

కాసిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం ఎంపీడీవో సత్యనారాయణసింగ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీవో సప్దర్ ఆలీ, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

బెల్లంపల్లి రూరల్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ, డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం యాంటి నార్కొటెక్ బ్యూరో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపెల్లి శంకర్, యాంటి డ్రగ్స్ కమిటీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ క్రమంలో వైస్ ప్రిన్సిపల్ తిరుపతి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకలకు హాజరు కావాలి

తాండూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మాదారం టౌన్‌లోని శ్రీ కోదండరామాలయంలో ఏప్రిల్ 6వతేదీన జరిగే శ్రీరామనవమి వేడుకలకు, ఆదివారం జిరగే ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డిని శనివారం కలిసి ఆహ్వానించారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, ఐఎన్‌టీయసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కాసిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండగను పురస్కరించుకుని కాసిపేటలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు శనివారం చేయూత స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు నిత్యవసర సరుకులను అందజేశారు. సమితి అధ్యక్షుడు ఆడెపు రవీందర్ పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

బెల్లంపల్లి, మార్చి29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం 35 మందికి కల్యాణలక్ష్మీ లబ్ధిదారులకు తహసీల్దార్ జోత్స్న చెక్కులను పంపిణీ చేశారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మల్లయ్య, నాయకులు శ్రీధర్, రమేశ్, రియాజ్ పాల్గొన్నారు.

వారసంతకు వేలం పాట

కాసిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్‌లో నిర్వహించే రెండు వార సంతల వేలం పాటను శనివారం నిర్వహించారు. వేలంకు ఎంపీడీవో సత్యనారాయణ హాజరయ్యారు. దేవాపూర్‌లోని పాత అంగడి బజార్‌లో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంతను రూ. 65 వేలకు, లారీయార్డు ఏరియాలో ప్రతి గురువారం నిర్వహించే వారసంతను రూ. 1.7 లక్షలకు తొడసం సురేష్ దక్కించుకున్నాడు.

నష్టపరిహారం అందజేత

వేమనపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని సుంపుటం గ్రామానికి చెందిన లేగదూడ యాజమాని కొండగొర్ల రాజన్నకు శనివారం కుష్నపల్లి అటవీ క్షేత్రాధికారి దయాకర్ రూ. 10 వేల నష్టపరిహారం చెక్కును అందజేశారు. రెండు నెలల క్రితం ఒడ్డుగూడం అటవీ ప్రాంతంలో రాజన్నకు చెందిన లేగదూడ పులి దాడిలో మృతిచెందిందని తెలిపారు.

లక్ష్యానికి మించి రుణాలు

నెన్నెల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) మండల సమాఖ్య ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశామని ఏపీఎం విజయలక్ష్మి అన్నారు. రూ. 24.32 కోట్లు లక్ష్యం కాగా అంతకంటే ఎక్కువగా రూ. 27.69 కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా అందజేశామన్నారు. శనివారం నెన్నెల సెర్ప్ కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. స్వయం సహాయక సంఘాలకు పెద్ద మొత్తంలో రుణాలు అందజేసిన ప్రభుత్వానికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వైద్య శిబిరం

దండేపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్, ఆధ్వర్యంలో మ్యాదరిపేటలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బీజేపీ మాజీ అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ప్రారంభించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేత

గర్మిళ్ల, మార్చి29 (గర్మిళ్ల): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నుంచి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా కన్వర్ట్ అయిన వారి ఎఫెక్ట్ డేట్ ఆఫ్ అపాయింట్‌మెంట్, నాలుగేళ్ల సర్వీసు యాడింగ్ గురించి కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా పంచాయతీ అధికారులను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీహరి జిల్లా పంచాయతీ కార్యదర్శి సెంట్రల్ జిల్లా ఫోరం ఆధ్వర్యంలో శనివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయంలో పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.

మూఢనమ్మకాలపై అవగాహన

మందమర్రిరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : యువకులు సత్ప్రవర్తనతో ఉండాలని మందమర్రిఎస్ఐ రాజశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో శనివారం రాత్రి పోలీసు కళాబృందంతో ప్రజలకు మత్తు పదార్థాల నివారణ, సైబర్ మోసాలు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్..గందరగోళం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వానికి చెల్లించే రుసుంతోపాటు అదనంగా అధికారులకు రూ. 80వేలు ఇవ్వాలని డాక్యుమెంట్ రైటర్ కొనుగోలు దారుని నుంచి వసూలు చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడ పూర్తయింది. సబ్ రిజి స్ట్రార్ కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగికి పై డబ్బులు ఇచ్చేందుకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విషయం బయటకు పొక్కడంతో అప్రమత్త మైన సదరు దస్తావేజులేఖరి అదనంగా తీసుకున్న డబ్బులను తిరిగి ఇచ్చేందుకు వినియోగదారుడితో కాళ్లబేరానికి వచ్చినట్టు తెలిసింది. అధికారులకు నగదు వసూలు చేసిన విషయమై సమాచారం ఉందా... లేదా అన్న విషయం పక్కన పెడితే ఒక్కో వినియోగదారుడి వద్ద అంత మొత్తం వసూలు చేయడం స్థానికంగా కలకలం రేపుతోంది. వసూలు చేసిన మొత్తంలో నుంచి కొంత మొత్తం వినియోగదారుడికి ఇప్పటికే చెల్లించగా మిగితాది త్వరలో ఇవ్వనున్నట్లు తెలిసింది.

వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపం వల్లే...

మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ ప్రియాంక

వెబ్‌సైట్‌లో అధిక రుసుం చూపించడం కేవలం సాంకేతిక సమస్య వల్లనే అని జరిగింది. ఈ విషయ మై పై అధికారులకు సమాచారం అందించాం. దళారుల విషయంలో కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదు వినియోగదారులు ఎవరు కూడ దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు. నేరుగా అధికారులను సంప్రదించి పని పూర్తి చేసుకోవాలి

నకిలీ విత్తనాలు కొని నష్టపోవద్దు

భీమిని, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు కొని రైతులు నష్టపోవద్దని భీమిని ఎస్సై విజయ్ కుమార్, ఇన్‌చార్జి మండల వ్యవసాయ శాఖ అధికారి వీరన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అనుమతి లేని గ్లైసిల్ విత్తనాలు వాడటం వల్ల భూమి సారం కోల్పోయి రానున్న రోజుల్లో పంటల దిగుబడి తగ్గుతుందని, పర్యావరణంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు వినోద్ కుమార్, అఫ్రోజ్, కార్తీక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సంగర్స్ రవీందర్ రావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బెల్లంపల్లి, మార్చి29(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ చౌరస్తా అడ్డా మీదకు వచ్చే రోజువారి కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శిగా రాజేశ్, పట్టణ కార్యదర్శిగా రాజు, పట్టణ అధ్యక్షులుగా వెంకన్న, సహాయ కార్యదర్శిగా క్రిష్ణ, ఉపాధ్యక్షులుగా లింగన్న, చిప్పకుర్తి బాపు, సలహాదారులుగా నారాయణ, గౌరవ అధ్యక్షులుగా రాజమౌళితోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

డంపింగ్ యార్డును ఎత్తివేయాలని నిరసన

బెల్లంపల్లి, మార్చి29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బస్తీ వాసులు డంపింగ్‌యార్డు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇండ్ల సమీపంలో పెద్ద ఎత్తున చెత్త వేస్తుండడంతో ప్రజల అనారోగ్య బారిన పడుతున్నారన్నారు. పోలీసులు వచ్చి సముదాయించడంతో నిరసన విరమించారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలని నిరసన

కాసిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సోమగూడెం నుంచి కాసిపేట బొగ్గుగనులకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ప్రమాదాలను నివారించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ కొంత కాలంగా సోమగూడెం నుంచి కాసిపేట 1, 2 గనులకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారిందని, దీంతో విధులకు హాజరయ్యే కార్మికులు గుంతల్లో వాహనాలు పడి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, సంతోష్, సతీష్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

బీసీ కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలి

మంచిర్యాలకలెక్టరేట్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్ రావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో నిర్వహించిన బీసీ పోరుగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, కిరణ్, కె. శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

మంచిర్యాలకలెక్టరేట్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల గర్మిళ్ల పాఠశాలలోని విద్యార్థులు శనివారం సేవా భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. సేవా భారతి సంస్థ ప్రతినిధులు ఎర్రబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సాంకేతిక విద్యపట్ల అవగాహన పెంచుకోవాలని, నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ల్యాప్‌టాప్‌లు ఎంతోగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హరీశ్, కిషన్‌శాస్త్రీ, రజనీశ్ జైన్, ఆనందరావు, శేఖర్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

బాబు గొంతులో ఇరుక్కున్న పిన్నీసు

ఎండోస్కోపీ ద్వారా బయటకు తీసిన వైద్యుడు

గర్మిళ్ల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): దహేగాం మండలం ఒడ్డు గూడ గ్రామానికి చెందిన మూడేళ్ల రిషి అనే బాబు శనివారం ఇంటి వద్ద ఆడుకుంటుండగా అనుకోకుండా గొంతులోకి పిన్నీసు పోయి ఇరుక్కుంది. దానిని కాకతీయ గ్యాస్ట్రో ఆసుపత్రి డాక్టర్ శ్రావణ్ తుమ్మాటి ఎండోస్కోపి ద్వారా గొంతులో ఉన్న పిన్నీసును బయటకు తీసి బాబును ప్రాణపాయం నుంచి కాపాడారు. దీంతో బాబు తల్లి దండ్రులు, వైద్యులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

షడ్రుచుల సమ్మేళనం..
'విశ్వావసు' ఆగమనం
●నేడు ఉగాది పర్వదినం.. 7
●ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు



ఎల్‌ఆర్‌ఎస్ గందరగోళం

200 గజాల స్థలానికి రూ. 3కోట్లు రిజిస్ట్రేషన్ చార్జీలు

- మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వెలుగు చూసిన ఘటన
- బిల్లు చూసి కంగుతిన్న వినియోగదారుడు
- వెబ్‌సైట్‌లో నెలకొన్న లోపమే కారణమంటున్న అధికారులు
- మరో ఘటనలోనూ వినియోగదారుడికి భారీగా వడ్డింపు



మంచిర్యాల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకో వింత ఘటన చోటుచేసుకుంటోంది. కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలతో వినియోగదారులు కంగు తినాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. రిజిస్ట్రేషన్ చేసే స్థలానికి సంబంధం లేకుండా అడ్డగోలు ఫీజులు వడ్డిస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. మం చిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ వినియోగదారుడు 200 చదరపు గజా ల స్థలానికి రిజిస్ట్రేషన్ కోసం వెళితే వెబ్‌సైట్‌లో ఏకంగా రూ. 3కోట్లపై చిలుకు ఫీజు చూపించడంతో ఒక్క సారిగా ఆందోళనకు గురయ్యాడు. ఈ వింతఘటన ఇటీవల చోటు చేసుకుంది.

ఆదినుంచి అడ్డంకులే ...

మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో ఆది నుంచి అపవాదులు చోటు చేసుకుంటున్నాయి. మొన్నటికి మొన్న వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యల కారణంగా అసలు చెల్లించిన ఫీజులే కనబడక పోగా వినియోగదారులు ఆందోళనకు గురయ్యారు. దీనికి తోడు గతంలో చెల్లించిన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు కూడా వెబ్‌సైట్‌లో అవికానరావడం లేదంటూ రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు అధికారులు ససేమిరా అనడంతో ఫీజులు తిరిగి చెల్లించాల్సి వచ్చింది. తాజాగ రిజిస్ట్రేషన్ చేసే స్థలం విస్తీర్ణంతో సంబంధం లేకుండా చార్జీలు వడ్డిస్తుండడంతో గందరగోళానికి గురవుతున్నారు. తాజాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన ఘటనలో వినియోగదారులతో పాటు అధికారులు సైతం నోరు వెళ్లబెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ఓ వినియోగదారుడు తనకు చెందిన 200 చదరపు గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు డాక్యుమెంట్ రైటర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించేందుకు యత్నించగా మొత్తం రూ. 3,27, 74,892 చూపించింది. ఇందులో రెగ్యులరైజేషన్ చార్జీల కింద రూ. 69,488,14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీల కింద రూ. 4,36,31,700 చూపించిం ది. మొత్తం రిజిస్ట్రేషన్ చార్జీల కింద 4,37,01,189 చెల్లించే విధంగా ఆన్‌లైన్‌లో రసీదు వచ్చింది. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కింద వెయ్యి రూపాయలు చెల్లించినందున దాంతో పాటు సకాలంలో రిజి స్ట్రేషన్‌కు ముందుకు వచ్చినందున 25శాతం రిబేట్ కింద మరి కొంత మొత్తం మినహాయించి మొత్తంగా రూ. 3,27,74,892 చెల్లించాలని డిమాండ్ వచ్చింది.

దీంతో కంగుతిన్న వినియోగదారుడు అధికారులను సంప్రదించగా ఆన్‌లైన్‌లో చూపించిన దానికి తాము బాధ్యులు కాదని సదరు మొత్తం ఫీజు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని తెలుపడంతో వినియోగదారుడు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరో కేసులోను ఇలాంటి ఘటన ఎదురైంది. రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ వినియోగదారుడు తన 240 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దరఖాస్తు చేసుకున్నాడు. అతనికి అన్ని చార్జీలతో సహా రూ.2,39,77,127 ఫీజు చెల్లించాలని రావడంతో అవాక్కయ్యాడు. ఈ విష యంలోను అధికారులు చేసేదేమిలేక చేతు లెత్తేశారు. ఇలా వినియోగదారులకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వింత ఘటనలు ఎదురవుతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు.

జోరుగా దళారుల దందా...

మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సాం కేతిక లోపాలు నెలకొనడం ఒక్కెత్తు అయితే దళారుల బెడద వినియోగదారులను మరింతగా వేధిస్తోంది. ఇటీవల మంచిర్యాలలోని గర్మిళ్ల శివారులో 11 గుంటల స్థలాన్ని తన అవసరం నిమిత్తం భూమి యజమాని అమ్ముకున్నాడు. స్థలానికి ఎల్‌ఆర్‌ఎస్ రుసుం కూడ చెల్లించారు. రిజిస్ట్రేషన్ చేయడానికి మిగతా 7వ పేజీలో

మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలి

గర్మిళ్ల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తిన టోల్‌ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించాలని మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వి. గంగాధర్ తెలిపారు. టోల్‌ఫ్రీ నెంబర్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్, విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన, బిల్లులోఏమైన హెచ్చుతగ్గులు ఉన్న ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసులకు సంబంధించిన పేరు మార్పు, క్యాటగిరి మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యల కోసం ఈ టోల్‌ఫ్రీ నెంబర్ సేవలు పొందాలని కోరారు.

'మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి'

మందమర్రిటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పాలకవర్గం లేని మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మున్సిపాలిటీ ఎన్నికల సాధన సమితి నాయకులు శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు అందుగుల శ్రీనివాస్ మాట్లాడుతూ పాలకవర్గం లేకపోడంతో ప్రజల సమస్యలను పరిష్కారం కావడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వారు మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడం గెలిచిన తర్వాత మర్చిపోవడం పరిపాటిగా మారిందన్నారు. మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించాలని త్వరలో సభ నిర్వహిస్తామన్నారు. దీక్ష చేపట్టిన వారిలో సమితి నాయకులు రాజశేఖర్, నరేష్, వెంకటేష్, ఆర్. వెంకన్న, రమేష్, తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, రసూల్, రాజయ్య, ఒడ్నాల శంకర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.





సింగరేణి భూ సమస్యలపై
సమగ్ర విచారణ చేపట్టాలి
కలెక్టర్ కుమార్ దీపక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలకలెక్టరేట్, మార్చి29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింగరేణి ప్రాంతంలో భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై రెవెన్యూ రికార్డులను పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపిన అనంతరం సత్వరమే చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బెల్లంపల్లి ఆర్డీవో హరిక్రిష్ణ, సింగరేణి శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల జీఎంలు జనరల్ మేనేజర్ శ్రీనివాస్, దేవేందర్‌లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా మండల, సబ్ డివిజన్ జిల్లా స్థాయిల్లో, సింగరేణి ప్రాంతంలో వచ్చే భూ సంబంధిత దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సింగరేణి ఓపెన్ కాస్టు ప్రాజెక్టులో జైపూర్ మండలం గుత్తెదారిపల్లె గ్రామంలో భూములు, ఇండ్లు కోల్పోతున్న బాధితులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ నవనీత, కలెక్టరేట్ ఎసెక్షన్ సూపరింటెండెంట్ సంతోష్ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా
ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులకే అందేలా చర్యలు తీసుకుంటామని, ఇందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం పొనకల్ గ్రామంలో న్యాక్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని రోటిగూడ, ఆదివాసీ గ్రామాలైన అల్లినగర్, దొంగపల్లి గ్రామాల్లో పర్యటించారు. అక్కడి ఆదివాసీలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తామన్నారు. అనంతరం మహ్మదాబాద్, పొనకల్ గ్రామపంచాయతీల్లో చేసిన చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహ ర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ, నాయకులు పసివుల్లా, అల్లం రవి, సుభాష్‌రెడ్డి, సయ్యద్ ఇసాక్, దుమ్మల రమేష్, ప్రవీణ్, ముత్యం సతీష్‌తో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.









